సాక్షి
మహబూబ్‌నగర్
బుధవారం ׀ 13 ׀ నవంబర్ ׀ 2024



రసవత్తరంగా..
లింగాలలో 10వ జోనల్ స్థాయి పోటీలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి.
వివరాలు 8లో ▸



కురుమూర్తి గిరుల కిటకిట
వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులతో కురుమూర్తిగిరులు కిటకిటలాడుతున్నాయి.
వివరాలు 8లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 36.4 / 18.3
ఉదయం చలి ఉంటుంది. కొద్దిమేర ఆకాశం మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

జడ్చర్ల: జిల్లా పరిధిలోని 108, 102 అంబులెన్స్‌లలో డ్రైవర్ ఉద్యోగాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ ఉదయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి విద్యార్హత, డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు మూడేళ్ల అనుభవం కలిగి 35 ఏళ్లలోపువారు అర్హులన్నారు. ఆసక్తి గలవారు గురువారం జిల్లాకేంద్రంలోని 108 కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాల కోసం సెల్ నం. 91007 99527ను సంప్రదించాలని సూచించారు.

డీఈఓగా ప్రవీణ్‌కుమార్



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల జిల్లాల డీఈఓగా ప్రవీణ్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గత డీఈఓ రవీందర్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేసిన నేపథ్యంలో పోస్టు ఖాళీ ఏర్పడింది. దీంతో వికారాబాద్ జిల్లా విద్యా శాఖ అడిషనల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్‌కుమార్‌ను డీఈఓగా నియమించింది.

ప్రజలకు ఆర్టీసీ లాజిస్టిక్ మెరుగైన సేవలు



స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రజలకు ఆర్టీసీ లాజిస్టిక్స్ (కార్గో) మెరుగైన సేవలు అందిస్తుందని ఏటీటీఎం ఇసాక్ బిన్ అహ్మద్ అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఆర్టీసీ లాజిస్టిక్స్ సేవలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్, జూబ్లీ బస్టాండ్‌కు సంబంధించిన 30 కౌంటర్లలో హోం డెలివరీ సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. వస్తువులను వినియోగదారులకు వారి ఇంటి వద్దే హోం డెలివరీ చేయడం జరుగుతుందన్నారు. ఉమ్మడి జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ లాజిస్టిక్ రీజియన్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ శ్రీధర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ల భర్తీకి ఇంటర్వ్యూ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని డైట్ కళాశాలలో వివిధ సబ్జెక్టుల కోసం ఖాళీగా ఉన్న పోస్టులను గెస్టు లెక్చరర్స్ ద్వారా భర్తీకి మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 16 మందికిపైగా అభ్యర్థులు హాజరవగా.. ఈ ప్రక్రియను ఆర్జేడీ విజయలక్ష్మి పరిశీలించారు. అయితే పలువురు అభ్యర్థులు అసలు నోటిఫికేషన్ ఇవ్వలేదని, అభ్యర్థులకు ఎవరికీ సమాచారం లేకుండా భర్తీ ప్రక్రియ చేపడుతున్నారని ఆరోపించారు. అలాగే రిటైర్డ్ అయిన వారికి అవకాశం ఇవ్వొద్దని, గతంలో పలువురు డైట్ కళాశాలల ఎదుట నిరసన చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం జరిగిన ఇంటర్వ్యూల్లో వారికి కూడా అవకాశం కల్పించడం వివాదాస్పదంగా మారింది. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ డీఈఓ గోవిందరాజులు, అడిషనల్ డైరెక్టర్ అనసూయ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మహబూబ్‌నగర్‌లో స్టెనో కం టైపిస్ట్, రికార్డు అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్న ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పాపిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టైపిస్ట్ ఒకటి (జనరల్- 1), రికార్డు అసిస్టెంట్ రెండు (ఓసీ మహిళ-1), (ఎస్సీ మహిళ- 1) డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీకి అభ్యర్థులు రిజిష్టర్ పోస్ట్ లేదా కొరియర్ ద్వారా ఈ నెల 28 సాయంత్రం 5 గంటలలోగా జిల్లా కోర్టు ప్రాంగణంలోని కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా కోర్టుల e-courtsవెబ్ సైట్‌లో చూడవచ్చని పేర్కొన్నారు.

ఆయాలే టీచర్లు..

అంగన్‌వాడీల్లో భర్తీకి నోచుకోని కాని టీచర్లు, ఆయాల పోస్టులు



- జిల్లావ్యాప్తంగా 371 పోస్టులు ఖాళీ
- అత్యధికంగా ఆయా పోస్టులే..
- కొన్ని కేంద్రాల బాధ్యతలు ఇన్‌చార్జిలకు
- అదనపు భారంతో అవస్థలు పడుతున్న వైనం

మహబూబ్‌నగర్ రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించి నవ సమాజ నిర్మాణానికి ప్రభుత్వం కృషిచేస్తుంది. జిల్లాలో అంగన్‌వాడీ టీచర్ పోస్టులు ఎప్పుడు భర్తీ చేస్తారా అని అర్హులు ఎదురు చూస్తున్నారు. మహిళా, శిశు సంరక్షణలో భాగంగా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్, ఆయా పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. మూడున్నరేళ్లుగా ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఆయా కేంద్రాల పరిధిలోని బాలింతలు, గర్భిణులు, పిల్లలు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. పలుచోట్ల ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్నారు.

ప్రాజెక్టుల వారీగా ఇలా..

జిల్లాలో నాలుగు ఐసీడీఎస్ ప్రాజెక్టుల కింద 1,126 మంది అంగన్‌వాడీ టీచర్లు పని చేస్తున్నారు. 59 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే 1,185 ఆయా పోస్టులు కాగా, ప్రస్తుతం 874 మంది పనిచేస్తున్నారు. 311 పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. అలాగే ప్రాజెక్టుల వారీగా పరిశీలిస్తే.. మహబూబ్‌నగర్ అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టులో 344 అంగన్‌వాడీ టీచర్లకు గాను 335 మంది పనిచేస్తుండగా 9 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మహబూబ్‌నగర్ రూరల్ ప్రాజెక్టు పరిధిలో 293 మంది టీచర్లకు గాను 272 మంది ఉండగా.. ఇక్కడ 21 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దేవరకద్ర ప్రాజెక్టు పరిధిలో 237 మంది టీచర్లకు గాను 230 మంది పనిచేస్తుండగా.. 7 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జడ్చర్ల ప్రాజెక్టులో 311 మంది టీచర్లకు గాను 289 మంది పనిచేస్తుండగా.. 22 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

■ జిల్లాలో అంగన్‌వాడీ టీచర్ పోస్టుల కంటే ఆయా పోస్టులే ఎక్కువగా ఖాళీలున్నాయి. మహబూబ్‌నగర్ అర్బన్‌లో 344 ఆయాలకు గాను 269 మంది పనిచేస్తుండగా 75 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రూరల్‌లో 293 ఆయాలకు గాను 203 మంది చేస్తుండగా.. 90 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దేవరకద్ర ప్రాజెక్టులో 237 మంది ఆయాలకు గాను 183 మంది పనిచేస్తుండగా.. 54 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జడ్చర్లలో 311 ఆయా పోస్టులకు గాను 219 మంది ఆయాలు పనిచేస్తుండగా 92 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

పనిభారంతో సతమతం..

అంగన్‌వాడీ టీచర్‌కు నెలకు రూ.13,650, ఆయాకు రూ.7,800 గౌరవ వేతనంగా ప్రభుత్వం అందజేస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లోని కేంద్రాల వారికి ఈ వేతనాలు కొంతమేర ఊరటనిచ్చే విధంగానే ఉన్నప్పటికీ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న కేంద్రాల టీచర్లు, ఆయాలకు ఈ జీతం ఏమాత్రం సరిపోవడం లేదని అంటున్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకపోవడంతో లబ్ధిదారులకు పౌష్టికాహారం సక్రమంగా అందడం లేదు. గ్రామాలు, పట్టణాల్లో ఉండే గర్భిణులు, బాలింతలు, ఐదేళ్లలోపు పిల్లలు రక్తహీనతకు గురికాకుండా, శారీరకంగా బలహీనం కాకుండా ఉండేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రతిరోజు పాలు, ఉడకబెట్టిన కోడిగుడ్డుతోపాటు ఆకుకూరలు, ఇతర కూరలతో పౌష్టికాహారం అందిస్తున్నారు. కేంద్రాల్లో టీచర్లు ఉంటేనే అందరికీ పౌష్టికాహారం సక్రమంగా అందుతుంది. అలాగే ఆరోగ్య, ఇతర సర్వేల బాధ్యతలను ఎక్కువగా అంగన్‌వాడీ టీచర్లకే అప్పగిస్తుంటారు. టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్న కేంద్రాల నిర్వహణ బాధ్యతను పక్క కేంద్రాల టీచర్లకు అప్పగించడంతో వారిపై అదనపు పనిభారం పడుతుంది. ఆయా పోస్టులు ఖాళీగా ఉన్న కేంద్రాల్లో టీచర్లే ఆ భారాన్ని మోస్తూ.. తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. టీచర్లకు సర్వే బాధ్యతలు అప్పగించినప్పుడు కేంద్రాలు మూతబడుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని మహిళలు కోరుతున్నారు.

జిల్లాలో టీచర్ పోస్టుల ఖాళీల వివరాలు

అంగన్‌వాడీ కేంద్రాలు : 1,185	టీచర్ పోస్టులు 1,185
పనిచేస్తున్న వారు : 1,126	ఖాళీలు : 59

త్వరలోనే నోటిఫికేషన్..

జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టుల వివరాలు సేకరించాం. వీటిని భర్తీ చేసేందుకు రాష్ట్ర కమిషనరేట్‌కు నివేదించాం. ఖాళీ పోస్టుల భర్తీకి అనుమతి వచ్చిన వెంటనే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి టీచర్, ఆయా పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ జారీ చేస్తాం. వీలైనంత త్వరగా పోస్టులు భర్తీ చేసి టీచర్లకు అదనపు బాధ్యతలు తప్పిస్తాం. – జరీనాబేగం, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారి

విద్యార్హత ఇంటర్..

అంగన్‌వాడీ టీచర్‌తోపాటు ఆయాలుగా ఉద్యోగాలకు నియమితులయ్యే వారు కనీసం ఇంటర్ ఉత్తీర్ణత ఉండాలి. గతంలో అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు కనీసం పదో తరగతి ఉత్తీర్ణత ఉండాలన్న నిబంధన ఉండేది. కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులకు విద్యార్హతను పెంచింది. ఇకపై కనీసం ఇంటర్మీడియట్ అర్హతగా నిర్ణయించింది. వయో పరిమితి 18– 35 ఏళ్ల మధ్య ఉండాలి. అలాగే 65 ఏళ్ల దాటిన తర్వాత వారి సేవలను వినియోగించుకోకూడదు. ఖాళీల్లో 50 శాతం ఆయాలకు పదోన్నతులు కల్పించి భర్తీ చేయాల్సి ఉంటుంది.

వడివడిగా..



ముమ్మరంగా కొనసాగుతున్న బైపాస్ నిర్మాణ పనులు

ఎన్‌హెచ్-167కే పనులు ముమ్మరం

- నిర్ణీత గడువులోగా బైపాస్ నిర్మాణాలు పూర్తిచేసేలా చర్యలు
- చివరి దశకు మొదటి ప్యాకేజీ పనులు
- కృష్ణానదిపై ఐకానిక్ వంతెనకు ఈ నెల 29న టెండర్ల ఓపెన్
- చౌటబెట్లకు వెళ్లే దారిలో చౌరస్తా ఏర్పాటుపై స్పష్టత కరువు

కొల్లాపూర్: కల్వకుర్తి నుంచి నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ మీదుగా నంద్యాల వరకు చేపట్టిన జాతీయ రహదారి–167కే నిర్మాణ పనులు వడివడిగా సాగుతున్నాయి. రహదారి నిర్మాణంలో భాగంగా చేపట్టిన బైపాస్ పనులు ఊపందుకున్నాయి. నిర్ణీత గడువులోగా ఆయా పనులు పూర్తిచేయాలనే లక్ష్యంతో సంబంధిత అధికారులు ముందుకు సాగుతున్నారు. అలాగే మల్లేశ్వరం- సంగమేశ్వరం ప్రాంతాల మధ్య కృష్ణానదిపై నిర్మించబోయే ఐకానిక్ సస్పెన్షన్ కేబుల్ బ్రిడ్జి పనులకు సంబంధించిన టెండర్లు కూడా ఈనెలాఖరులో ఓపెన్ కానున్నాయి.

గత సెప్టెంబర్‌లో టెండర్లు

ఎన్‌హెచ్–167కేలో భాగంగా మల్లేశ్వరం నుంచి సంగమేశ్వరం వరకు కృష్ణానదిపై 87.360 కి.మీ., నుంచి 88.437 కి.మీ., వరకు ఐకానిక్ సస్పెన్షన్ కేబుల్ బ్రిడ్జి నిర్మించనున్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం కోసం గత సెప్టెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించగా.. అంతర్జాతీయ కంపెనీలు ముందుకు వచ్చాయి. అయితే ఆయా కంపెనీల అర్హతలను పరిశీలించే ప్రక్రియను నేషనల్ హైవే అథారిటీ అధికారులు చేపట్టారు. ఈ నెల 29న టెండర్ ఓపెన్ చేయనున్నట్లు అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపర్చారు.

చౌటబెట్ల చౌరస్తా కోసం..

కొల్లాపూర్ నుంచి చౌటబెట్లకు వెళ్లే దారిలో చౌరస్తా ఏర్పాటు చేయాలని స్థానిక నేతలు కోరుతున్నారు. ఈ మేరకు ఇటీవల రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఎన్‌హెచ్ అధికారులతో మాట్లాడారు. చౌటబెట్లకు వెళ్లే దారిలో అండర్‌పాస్ బ్రిడ్జి కాకుండా చౌరస్తా ఏర్పాటు చేయాలని.. లేదంటే ఫ్లైఓవర్ నిర్మించాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు కూడా సంబంధిత అధికారులతో మాట్లాడారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు చౌటబెట్ల దారిలో చౌరస్తా ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ అంశంపై త్వరలోనే స్పష్టత రానుంది.

రూ.436.91 కోట్ల వ్యయంతో..

భారత్‌మాల పథకంలో భాగంగా కల్వకుర్తి నుంచి ఏపీలోని నంద్యాల వరకు జాతీయ రహదారి–167కే నిర్మాణ పనులను కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. మొదటి ప్యాకేజీలో భాగంగా రూ.436.91 కోట్ల వ్యయంతో కల్వకుర్తి నుంచి కొల్లాపూర్ వరకు 85 కి.మీ., మేరకు రహదారి నిర్మాణం చేపట్టారు. కల్వకుర్తి నుంచి తాడూరు వరకు, నాగర్‌కర్నూల్ నుంచి కొల్లాపూర్ వరకు రహదారి పనులు చివరి దశకు చేరుకున్నాయి. కల్వకుర్తి, కొల్లాపూర్ సమీపంలో నిర్మిస్తున్న బైపాస్ రహదారి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ప్రధాన చౌరస్తాల్లో ఫ్లైఓవర్ నిర్మాణాలు చేపట్టారు. మేడిపూర్ సమీపంలోని డిండి వాగుపై వంతెన నిర్మాణం 50 శాతం పూర్తయింది. కొన్నిచోట్ల కల్వర్టుల నిర్మాణాలు సాగుతున్నాయి. గ్రామాల్లో జాతీయ రహదారికి ఇరువైపులా ఇనుప కంచెలు.. మరికొన్ని చోట్ల డివైడర్లు ఏర్పాటు చేశారు.

మార్కింగ్ చేశారు..

కొల్లాపూర్ సమీపంలో చేపట్టిన బైపాస్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న వారికి పరిహారం చెల్లింపుల ప్రక్రియను పూర్తిచేశాం. సాంకేతిక కారణాల వల్ల కొందరికి పరిహారం చెల్లింపులో జాప్యం జరిగింది. సోమశిల రోడ్డు నుంచి మల్లేశ్వరం వరకు చేపట్టే జాతీయ రహదారి నిర్మాణ ప్రాంతంలో భూసేకరణ కోసం గతంలో మార్కింగ్ చేశారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే భూసేకరణ ప్రక్రియ చేపడతాం. – భన్సీలాల్, ఆర్డీఓ, కొల్లాపూర్

భూసేకరణకు సమాయత్తం..

కల్వకుర్తి నుంచి కొల్లాపూర్ వరకు బైపాస్ రహదారులు నిర్మించే ప్రాంతాల్లో భూములు కోల్పోతున్న వారికి నష్టపరిహారం చెల్లింపులు చేపట్టారు. కల్వకుర్తి, కొల్లాపూర్‌లో పరిహారం చెల్లింపులు దాదాపుగా పూర్తయ్యాయి. నాగర్‌కర్నూల్‌లో మాత్రం ఇంకా చెల్లింపులు జరగాల్సి ఉంది. మొదటి ప్యాకేజీలో భాగంగా కొల్లాపూర్ సమీపం వరకు జాతీయ రహదారి నిర్మిస్తున్నారు. రెండో ప్యాకేజీలో సోమశిల రోడ్డు నుంచి మల్లేశ్వరం వరకు రహదారి నిర్మించనున్నారు. అందుకు అవసరమైన భూసేకరణ, పరిహారం చెల్లింపుల ప్రక్రియ పూర్తిచేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. సోమశిల వద్ద ఐకానిక్ బ్రిడ్జి టెండర్లు ఓపెన్ అయిన తర్వాత ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టనున్నారు. అటవీ భూముల్లో రోడ్డు నిర్మాణం కోసం అవసరమైన అనుమతులకు చర్యలు చేపట్టారు.



కొల్లాపూర్ సమీపంలో చేపట్టిన జాతీయ రహదారి నిర్మాణం

భరోసా సెంటర్‌తో మహిళలకు రక్షణ



భరోసా సెంటర్ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎంపీ డీకే అరుణ, కలెక్టర్ విజయేందిర, ఎస్పీ జానకి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

పాలమూరు: భరోసా సెంటర్ ద్వారా బాధిత మహిళలకు రక్షణ కల్పించడంతోపాటు వారికి అవసరమైన న్యాయ సహాయం అందించడం జరుగుతుందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని మోనప్పగుట్టలో నూతనంగా నిర్మించిన భరోసా సెంటర్ భవనాన్ని మంగళవారం ఎంపీ డీకే అరుణ, కలెక్టర్ విజయేందిర, ఎస్పీ జానకి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి చిన్నారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భరోసా సెంటర్ల ద్వారా మహిళలకు పూర్తి సంరక్షణ కల్పించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. మహిళలు, బాలికలపై జరిగే అత్యాచారాలు, అఘాయిత్యాలు, పోక్సో కేసులలో ఈ సెంటర్ ద్వారా న్యాయం, సహకారం అందించి భరోసా కల్పిస్తారన్నారు. మహిళలు ప్రతిఒక్కరూ భరోసా సెంటర్ ద్వారా లభించే సేవలు, సదుపాయాలతోపాటు కేసు నమోదు లాంటి విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. బాధిత మహిళలు ధైర్యంగా పోలీస్ స్టేషన్ లేదా భరోసా సెంటర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. మెగా కంపెనీ వారు రూ.2.10 కోట్లతో భవనం నిర్మించడం గొప్ప విషయమన్నారు. ఎస్పీ జానకి మాట్లాడుతూ భరోసా కేంద్రం అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, మహిళా భద్రత విభాగం హైదరాబాద్ నియంత్రణలో నడుస్తుందన్నారు. భరోసా సెంటర్ ద్వారా బాధితులు ఒకేచోట అనేక రకాలసేవలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఉమెన్ సేఫ్టివింగ్ ఎస్పీ అశోక్‌కుమార్, ఏఎస్పీ రాములు, ఏఆర్ ఏఎస్పీ సురేష్‌కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు జగపతిరావు తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికకు నోటిఫికేషన్

జడ్చర్ల: జడ్చర్ల మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికకు మంగళవారం కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల 18న మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించనున్నారు. అంతకు ముందు ఈ నెల 14న పాలక మండలి, ఎక్స్ అఫీషియో సభ్యులకు నోటీసులు అందజేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి తెలిపారు. అయితే ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఎన్నికలో పాల్గొనాలని కోరుతూ నోటీసు ఇవ్వనున్నారు. కాగా జూలై 25న మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మిపై సొంత పార్టీ సభ్యులే అవిశ్వాస తీర్మానం పెట్టి పదవి నుంచి తొలగించగా.. మూడు నెలల పాటు నోటిఫికేషన్ జారీలో ఆలస్యమైంది. ఎట్టకేలకు ఈ నెల 18న నూతన చైర్‌పర్సన్ ఎన్నిక జరగనుండగా.. అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

పోటాపోటీ..

మున్సిపల్ చైర్‌పర్సన్ పదవికి పోటాపోటీ నెలకొంది. బీసీ మహిళకు రిజర్వు అయిన ఈ పదవికి బీఆర్‌ఎస్‌కు చెందిన పుష్పలత, శ్రీశైలమ్మ, లత, చైతన్య, నవనీత పోటీ పడుతున్నారు. అయితే మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి నిర్ణయం మేరకే అభ్యర్థిత్వం ఖరారు ఉంటుందని సభ్యులు భావిస్తున్నారు.

ముగిసిన పీయూ మూడో దశ కౌన్సెలింగ్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని వివిధ పీజీ కోర్సుల్లో అడ్మిషన్లకు ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పీజీ సెట్ కౌన్సెలింగ్ మూడో దశ ప్రక్రియ మంగళవారం ముగిసింది. పీజీలో మొత్తం 14 కోర్సులు ఉండగా అందులో 700 సీట్లకు గాను 563సీట్లు భర్తీ అయ్యాయి. అలాగే ఎంబీఏ, ఎంసీఏలో 120 సీట్లకు గాను 120 సీట్లు భర్తీ అయ్యాయి.

గ్రూప్-3 పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహిస్తున్న గ్రూప్-3 పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గ్రూప్-3 పరీక్షలపై డిపార్ట్‌మెంటల్, జాయింట్ రూట్, ఫ్లయింగ్ స్క్వాడ్, ఐడెంటిఫికేషన్, పోలీస్ నోడల్ అధికారులు, రీజినల్ కోఆర్డినేటర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్–1 జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీ, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్–2 హిస్టరీ, పాలిటీ అండ్ సొసైటీ పరీక్ష ఉంటుందన్నారు. ఉదయం పరీక్షకు 9.30 గంటలకు, మధ్యాహ్నం పరీక్షకు 2.30 గంటలకు కేంద్రం గేట్లు మూసివేస్తారన్నారు. అలాగే సోమవారం పేపర్- 3 ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగుతుందని, పరీక్ష కేంద్రం గేట్లు ఉదయం 9.30 గంటలకే మూసివేస్తారన్నారు. పరీక్ష కేంద్రంలోకి ఎలాంటి ఉపకరణాలు తీసుకెళ్లరాదన్నారు. మహబూబ్‌నగర్, దేవరకద్రలోని 52 కేంద్రాల్లో నిర్వహించనున్న పరీక్షకు 19,465 మంది అభ్యర్థులు హాజరవుతారన్నారు. ప్రతి అభ్యర్థి బయోమెట్రిక్ హాజరు క్యాప్చర్ చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ రవికుమార్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌పై దాడి చేయడం హేయమైన చర్య



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగ సంఘాల నాయకులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): వికారాబాద్ కలెక్టర్‌పై కొంత మంది దాడి చేయడం హేయమైన చర్య అని ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు అన్నారు. వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట నల్లబ్యాడ్జిలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ రాజీవ్‌రెడ్డి, టీజీఓ జిల్లా అధ్యక్షుడు రాజ్‌గోపాల్, టిస్రా జిల్లా అధ్యక్షుడు చెన్నకిష్టన్న, నాలుగో తరగతి ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు నరేందర్, పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణ కోసం వెళ్లిన కలెక్టర్‌తోపాటు ఇతర అధికారులపై దాడి చేసిన వారిని వెంటనే చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రైతుల ముసుగులో కొంతమంది అధికారులపై దాడి చేశారని ఆరోపించారు. ఇలా దాడులు చేస్తే ప్రజాస్వామ్యానికి విలువ లేకుండా పోతుందన్నారు. ఉద్యోగులు కూడా ఈ ప్రాంతవాసులే అని ప్రజలు గుర్తించాలని హితవు పలికారు. అనంతరం కలెక్టర్ విజయేందిరకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు చంద్రనాయక్, మదన్‌మోహన్, వెంకటేశ్, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, కృష్ణమోహన్, వెంకట్రామరెడ్డి, నందకిషోర్, నాగరాజు, కృష్ణకాంత్, కృష్ణ, నాగన్న, మహేశ్వర్‌రెడ్డి, కృష్ణకుమార్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


దూపం పెద్దయ్య (ఫైల్)

పెబ్బేరు రూరల్: ఇంట్లో ఉరేసుకొని అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం చెలిమిల్ల కిష్టారెడ్డిపేటలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి వివరాల ప్రకారం.. పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని చెలిమిల్ల కిష్టారెడ్డిపేటలో దూపం పెద్దయ్య(50) కూతురు వివాహంపై కుటుంబంలో కొంత కాలంగా కలహాలు ఉన్నాయి. ఈ విషయంపై సోమవారం రాత్రి మరోసారి గొడవ జరిగింది. దీంతో అందరు భోజనం చేసిన తర్వాత నిద్రిస్తున్న సమయంలో సోమవారం అర్ధరాత్రి ఇంట్లోని పైకప్పు రాడ్‌కు తన అద్దపంచతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వనపర్తి మార్చురీకి తరలించారు. పెద్దయ్య తమ్ముడు దూపం సర్వేశ్వర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

దాచిపెట్టి పెళ్లి చేసుకున్నాడు..

- న్యాయం కోసం బాధితురాలి ఫిర్యాదు


మొదటి భార్యతో తాహేర్ (ఫైల్)

శాంతినగర్ : తన భర్తకు ముందుగానే వివాహమైన విషయం దాచిపెట్టి తనను పెళ్లి చేసుకున్నాడంటూ ఓ వివాహిత మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. శాంతినగర్‌కు చెందిన షేక్ నాషీన్‌కు వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలానికి చెందిన షేక్ తాహేర్‌కు 2022 మార్చి 27న వివాహం జరిపించారు. పెళ్లైనప్పటి నుంచి అత్త, ఆడపడచులు, భర్త వేధించేవారు. ఇదే విషయాన్ని అప్పట్లో శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌లో నాషన్ ఫిర్యాదు చేసింది. 2017లో సన్నిస్మిత్ అనే ఆమెను పెళ్లి చేసుకున్న విషయాన్ని తాహేర్ దాచిపెట్టాడు. తనను 2022లో పెళ్లి చేసుకున్న విషయం తెలిసిన సన్నిస్మిత్ బంధువులు ఇటీవలే తనను కొట్టారు. తాను పుట్టింటికి వచ్చేసినట్లు నాషన్ పేర్కొన్నారు. భర్త, అతడి కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసింది.

ఏడు పాములు పట్టివేత



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం 4గంటల నుంచి 7.30గంటల వ్యవధిలో ఏడు పాములు పట్టుకున్నట్లు సర్పరక్షకుడు డా. సదాశివయ్య తెలిపారు. శిక్షణ పొందిన ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు నవనీత్, రవీంద్రనాయక్‌లతోపాటు తాను పాములను పట్టుకున్నామన్నారు. వాటిలో ఒకటి నాగుపాము, ఐదు నీరుకట్టలు, ఒకటి కూడుపాము ఉన్నాయన్నారు. ఇళ్లల్లోకి పాములు వస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఇంట్లో చోరీ

ఊర్కొండ: ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు పడి చోరీకి పాల్పడిన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని మాధారం గ్రామానికి చెందిన బోయ కుర్మయ్య తన తండ్రి దశదిన కర్మ ముగిసిన తర్వాత కుటుంబ సభ్యులతో కలిసి ఊర్కొండపేట అభయాంజనేయ ఆలయానికి నిద్ర చేసేందుకు వెళ్లారు. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు రెండుతులాల బంగారం, ఇరవై తులాల వెండి వస్తువులు చోరీ చేశారు. దీన్ని గుర్తించిన ఇంటి పక్కల వారు కుర్మయ్యకు సమాచారం అందించారు. వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్‌ఐ వీరబాబు సిబ్బందితో వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుర్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో

ధరూరు : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోలు స్వల్పంగా కొనసాగుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. మంగళవారం సాయంత్రం వరకు ప్రాజెక్టుకు 4వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ప్రాజెక్టు నుంచి మొత్తం 3,856 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 9.234 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

రామన్‌పాడుకు..

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో మంగళ వారం నాటికి పూర్తిస్థాయి నీటిమట్టం 1,020అడుగులకు చేరింది. జూరాల ఎడమకాల ద్వారా 1,030 క్యూసెక్కులు, సమాంతర కాలువ ద్వారా 1000క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. తాగునీటి అవసరాల కోసం 20క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ వరప్రసాద్ తెలిపారు.

రసవత్తరంగా జోనల్ క్రీడలు


కబడ్డీ పోటీల్లో తలపడుతున్న మదనాపూర్-దామరగిద్ద జట్లు

లింగాల: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న 10వ జోనల్‌స్థాయి (బాలుర) క్రీడా పోటీలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని 13 గురుకులాల క్రీడాకారులు స్పోర్ట్స్, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటాపోటీగా తలపడుతున్నారు. రెండో రోజు మంగళవారం నిర్వహించిన క్రీడా పోటీల్లో పలువురు క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ చాటారు. అండర్-14 విభాగం లాంగ్ జంప్‌లో ఎం.ప్రవీణ్ (అచ్చంపేట) మొదటి, ఎస్.రాంచరణ్ (జేపీ నగర్) ద్వితీయ, వినయ్‌కుమార్ (అచ్చంపేట) తృతీయ స్థానాల్లో నిలిచారు. అండర్-14 చెస్ పోటీల్లో విన్నర్‌గా హేమచరణ్ (లింగాల), రన్నర్‌గా శ్రీకాంత్ (జేపీ నగర్) విజయం సాధించారు. అండర్-17 చెస్‌లో మొదటి స్థానంలో సీహెచ్ నవీన్ (దామరగిద్ద), రెండవ స్థానంలో శరత్‌చంద్ర (గద్వాల), అండర్-19 చెస్‌లో విన్నర్‌గా జగదీష్ (లింగాల), రన్నర్‌గా నితీష్ (అయిజ), అండర్-14 క్యారమ్స్‌లో విన్నర్‌గా డి.భరత్-పాలు (జేపీ నగర్), రన్నర్‌గా అభినయ్-సిద్దార్థ (పెద్దకొత్తపల్లి) విజయం సాధించారు. అండర్-17 విభాగం 5కే రన్‌లో మొదటి స్థానంలో మధునాయక్ (మదనాపూర్), రెండవ స్థానంలో సిద్దార్థ (జేపీ నగర్), మూడవ స్థానంలో శివకుమార్ (దామరగిద్ద) నిలిచారు. అండర్-19 విభాగం 5కే రన్‌లో సి.అనిల్ (బిజినేపల్లి) మొదటి, శివకుమార్ (లింగాల) ద్వితీయ, సంతోష్ (లింగాల) తృతీయ స్థానంలో నిలిచారు. అండర్-17 బాల్ బ్యాడ్మింటన్ ఫైనల్‌లో ఇటిక్యాల మొదటి స్థానం, లింగాల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. వంద మీటర్ల పరుగు పందెంలో భానుప్రసాద్ (లింగాల) మొదటి, గణేష్(లింగాల) ద్వితీయ, ప్రశాంత్ (బాలానగర్) తృతీయ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ బాలస్వామి, పీడీ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

జడ్చర్ల: మండలంలోని చిట్టెబోయిన్‌పల్లి సమీపంలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో 10వ జోనల్ స్థాయి క్రీడా పోటీలు మంగళవారం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల పరిధిలోని ఎనిమిది సోషల్ వెల్ఫేర్ స్కూల్స్, జూనియర్ కళాశాలలకు చెందిన 680 మంది బాలికలు క్రీడలలో పాల్గొన్నారు. అండర్- 14, 17, 19 విభాగాలకు సంబంధించి అథ్లెటిక్స్, లాంగ్‌జంప్, హైజంప్, టెన్నికాయిట్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, చెస్, క్యారమ్స్ పోటీల్లో బాలికలు పాల్గొన్నారు. మరో రెండు రోజుల పాటు క్రీడా పోటీలు కొనసాగనున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అనిత, జిల్లా కోఆర్డినేటర్ వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.


నారాయణపేట- మరికల్ జట్ల మధ్య కొనసాగుతున్న కబడ్డీ

జాతీయ గోగేమ్ పోటీలకు రాష్ట్ర క్రీడాకారులు

మహబూబ్‌నగర్ క్రీడలు: మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్‌లో శుక్రవారం నుంచి ఆదివారం వరకు జరిగే జాతీయస్థాయి 2వ సీనియర్, 1వ సబ్ జూనియర్, జూనియర్ (సింగిల్, టీం ఈవెంట్) గోగేమ్ టోర్నీలో పాల్గొనే రాష్ట్ర క్రీడాకారులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా మంగళవారం జిల్లాకేంద్రంలో క్రీడాకారులను కౌన్సిలర్ స్వప్న అభినందించారు. జాతీయస్థాయి గోగేమ్‌లో ప్రతిభచాటి పతకాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో గోగేమ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ సీనియర్ ఉపాధ్యక్షుడు మహ్మద్ షకీల్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి గులాం అఫ్రోజ్, అర్జునయ్య, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల వీరే..

సబ్ జూనియర్ విభాగం సింగిల్‌లో చేతన్ చంద్ర, కృష్ణ, సబ్ జూనియర్ టీం ఈవెంట్‌లో రయ్యాన్ నజమ్, సబావత్ వర్షిత్, శ్రీదత్త, బషీర్, పి.రాజేష్, జూనియర్ విభాగం సింగిల్‌లో బషీరుద్దీన్, కె.హారిక, సీనియర్ విభాగం సింగిల్‌లో మహ్మద్ రయ్యాన్ నజమ్ పోటీపడనున్నారు.



హోరాహోరీగా జోనల్ స్థాయి పోటీలు


వాలీబాల్‌లో వెల్దండపై గెలిచి సెమీస్ చేరిన గోపాల్‌పేట జట్టు

గోపాల్‌పేట: మండలంలోని బుద్దారం గురుకుల పాఠశాలలో సోమవారం ప్రారంభమైన జోనల్ స్థాయి ఆటల పోటీలు మంగళవారం రెండోరోజు కొనసాగాయి. రెండోరోజు అండర్- 17 కబడ్డీ పోటీల్లో మన్ననూర్, తెలకపల్లి పోటీపడగా తెలకపల్లి విజయం సాధించింది. అండర్- 14 కబడ్డీలో అలంపూర్, పెద్దమందడి పోటీపడగా అలంపూర్ విజయం సాధించింది. అండర్- 19 కబడ్డీలో గోపాల్‌పేట, పెద్దమందడి పోటీపడగా గోపాల్‌పేట విజయం గెలుపొందింది. అలాగే అండర్- 17 వాలీబాల్ పోటీల్లో గట్టు, వెల్దండ పోటీపడగా గట్టు, అండర్- 19 వాలీబాల్ పోటీలో మానవపాడు, మన్ననూరు జట్లు పోటీపడగా మానవపాడు విజయం సాధించింది. అథ్లెటిక్స్ అండర్- 14 డిస్కస్‌త్రోలో తెలకపల్లికి చెందిన ప్రేమలత మొదటిస్థానం, మానవపాడుకు చెందిన సుప్రియ రెండోస్థానం, కొల్లాపూర్‌కు చెందిన నిహారిక సాయి మూడోస్థానంలో నిలిచారు. అండర్- 19 షాట్‌పుట్‌లో పెద్దమందడికి చెందిన నందిని, మన్ననూరుకు చెందిన స్పందన, గట్టుకు చెందిన జయశాలిని మూడోస్థానంలో నిలిచారు. క్రీడాపోటీలను జోనల్ ఇన్‌చార్జ్ భాస్కర్‌గౌడ్, ప్రిన్సిపల్ ఆరోగ్య పర్యవేక్షించారు.


కబడ్డీ పోటీలో తలపడుతున్న మన్ననూర్, తెలకపల్లి జట్లు

వివాహేతర సంబంధానికి అడ్డుగా మారాడని..


హత్యకు సంబంధించి వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన భార్య

- నిందితుల అరెస్ట్ – రిమాండ్‌కు తరలింపు
- ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్ క్రైం: వివాహేతర సంబంధానికి అడ్డుగా మారాడని ఓ భార్యను ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసింది. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. ఈనెల 7న వెల్దండ మండలంలో జరిగిన హత్యకేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో వెల్లడించారు. వెల్దండ మండలంలోని ఎంజీకాలనీతండాకు చెందిన రాజు, హిమబిందు తొమ్మిదేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఏడాది కాలంగా హిమబిందు మహేశ్వరం మండలం క్లోంచెరువుతండాకు చెందిన చంటితో వివాహేతర సంబంధం కొనసాగిస్తుంది. ఇదే క్రమంలో తమ అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్తను హతమార్చాలని నిర్ణయించుకుంది. ఆమె ప్రియుడు చంటి, అతడి స్నేహితుడు రాకేష్ సహాయంతో ఈనెల 7వ తేదీ అర్ధరాత్రి ఎంజీకాలనీతండాలో వ్యవసాయపొలంలో నిద్రిస్తున్న రాజును సుత్తితో తలపై మోది హతమార్చారు. మృతదేహాన్ని ముగ్గురు కలిసి కొంతదూరంలో పడవేశారు. తన భర్త కనబడటంలేదని మృతుడి అన్నలాలుకు హిమబిందు ఫోన్ చేసింది. దీంతో కుటుంబసభ్యులు ఈనెల 8న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఈ మేరకు పోలీసులు మృతదేహాన్ని గుర్తి కేసు దర్యాప్తు ప్రారంభించారు. రాజును హతమార్చిన నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా వారు నేరం అంగీకరించారు.

న్యాక్ బృందం పరిశీలనపై సమీక్ష


మాట్లాడుతున్న వీసీ జీఎన్ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీని త్వరలో న్యాక్ పీర్ టీం సందర్శించనున్న నేపథ్యంలో అందుకు సంబంధించి పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని వైస్ చాన్స్‌లర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు మంగళవారం అడ్మినిస్ట్రేషన్ భవనంలో వివిధ డిపార్ట్‌మెంట్ల హెచ్ఓడీలతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్లకు సంబంధించి అన్ని యాక్టివిటీస్ డేటాను న్యాక్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారో దానిని పూర్తిగా డాక్యుమెంట్స్ రూపంలో సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. క్రైటీరియా కోఆర్డినేటర్స్ డాక్యుమెంట్స్‌కు సంబంధించి ఏవైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, ఈసారి కచ్చితంగా న్యాక్ గ్రేడింగ్ పెంచేందుకు ప్రతిఒక్కరు కృషిచేయాలన్నారు. గ్రేడింగ్ పెరిగితే నిధులు కూడా పెరుగుతాయన్న విషయాన్ని గుర్తించుకోవాలని సూచించారు. సమావేశంలో రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, ఐక్యూఏసీ డైరెక్టర్ నూర్జహాన్, కంట్రోలర్ రాజ్‌కుమార్, అంకం భాస్కర్, చంద్రకిరణ్, వెంకట్‌రెడ్డి, బషీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.


హుండీ డబ్బులు లెక్కిస్తున్న సిబ్బంది


కురుమూర్తి స్వామిని దర్శించుకున్న భక్తులు

కురుమూర్తి గిరుల కిటకిట

- వైభవంగా కొనసాగుతున్న జాతర.. తరలివస్తున్న భక్తజనం

చిన్నచింతకుంట:పాలమూరు మట్టిబిడ్డల ఇంటి ఇలవేల్పు కురుమూర్తిస్వామి జాతర వైభవంగా కొనసాగుతుంది. ఉత్సవాలకు రాష్ట్రంతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్ర ప్రాంతాల నుంచి తరలివస్తున్న భక్తులతో కురుమూర్తి గిరులు కిటకిటలాడుతున్నాయి. మంగళవారం ఉదయం పూజారులు ఆలయాన్ని శుద్ధి చేసి సుప్రభాత సేవతో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. పుష్కరిణిలో స్నానాలు ఆచరించిన భక్తులు తడిగుడ్డలతో స్వామి, అమ్మవార్లను దర్శించుకొని ముడుపులు కట్టారు. అలివేలు మంగమ్మ, ఆంజనేయ స్వామి, చెన్నకేశవస్వాముల ఆలయాల వద్ద భక్తుల రద్దీ కనిపించింది.

హుండీ ఆదాయం రూ.25.54 లక్షలు..

బ్రహ్మోత్సవాలు, జాతర ఉత్సవాలను పురస్కరించుకొని కురుమూర్తిస్వామికి భక్తులు కానుకలుగా సమర్పించిన హుండీని మొదటిసారిగా ఆలయ అధికారులు మంగళవారం లెక్కించారు. స్వామివారి హుండీ ఆదాయం రూ.25,54,805 వచ్చినట్లు ఈఓ మధనేశ్వర్‌రెడ్డి, చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భాస్కరచారి, కమలాకర్, ప్రభాకర్‌రెడ్డి, నాగరాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


స్వామివారి పాదుకల వద్ద గండదీపం మోస్తున్న మహిళ

బీసీలు ఐకమత్యంతో పోరాడాలి

- బీసీ ఇంటలెక్చువల్ ఫోరం కన్వీనర్ టి.చిరంజీవులు


సదస్సులో మాట్లాడుతున్న టి.చిరంజీవులు

స్టేషన్ మహబూబ్‌నగర్: బీసీలు చైతన్యవంతులై ఐకమత్యంతో పోరాడి అధికారాన్ని సాధించుకోవాలని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం కన్వీనర్ టి.చిరంజీవులు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం బీసీ సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీల సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీసీలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు రాజ్యాధికారం దోహదపడుతుందన్నారు. బీసీల్లో నాయకత్వ లక్షణాలున్న లీడర్లు పుట్టుకొస్తున్నారన్నారు. బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బీసీ భావజాల వ్యాప్తిని సమాజంలోకి తీసుకెళ్లాలన్నారు. రవికుమార్ ప్రజాప్రతి మాట్లాడుతూ సివిల్ సర్వీసెస్ ఉద్యోగాల్లో బీసీలు చాలా అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు మాట్లాడుతూ బీసీలు ప్రశ్నిస్తే మాట్లాడితే అవితిట్లుగా భావిస్తున్నారన్నారు. బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.శ్రీనివాస్‌సాగర్, కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గన్న, స్వాతంత్ర సమర యోధులు వకీల్ భీమయ్య, సీనియర్ న్యాయవాది బెక్కం జనార్దన్, ఆయా కుల సంఘాల ప్రతినిధులు సారంగి లక్ష్మీకాంత్, మహేందర్, ఆశన్న ముదిరాజ్, లక్ష్మణ్‌గౌడ్, రమేష్‌గౌడ్, శివాని, బాలమణి పాల్గొన్నారు.

ఆశ వర్కర్ వేతనం కాజేత?

- మరో ఆశతో పనులు చేయించి.. వేతనం డబ్బులు వసూలు చేసిన అధికారులు



భూత్పూర్: మండలంలోని శేరిపల్లి(బి) గ్రామంలో ఆశ వర్కర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సునీత విధులకు గైర్హాజరైనా.. మరో ఆశతో (భూత్పూర్) పనులు చేయించి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారులు వేతనం కాజేసినట్లు తెలిసింది. ఆశ వర్కర్ సునీత మూడు నెలలుగా తల్లి అనారోగ్యం కారణంగా విధులకు హాజరుకావడం లేదు. అలాగే ప్రతినెలా మొదటి వారంలో పీహెచ్‌సీలో నిర్వహించే ఆశ డే సమావేశానికి సైతం గైర్హాజరైంది. అయితే సునీత విధులకు హాజరైనట్లు రికార్డుల్లో నమోదు చేసి.. ఆమెకు వేతనం పడిన వెంటనే వసూలు చేసినట్లు సమాచారం. సునీత అకౌంట్‌లో డబ్బులు నేరుగా పడుతుండడంతో.. ఆ డబ్బులు ఇవ్వాలని ఆమెపై అధికారులు ఒత్తిడి చేశారు. దీంతో చేసేది లేక వేతనం డబ్బులు వారికి తిరిగి ఇచ్చినట్లు తెలిసింది. కాగా.. తాజాగా పీహెచ్‌సీ సూపర్‌వైజర్ సుధాకర్ తనిఖీలో ఈ విషయం బహిర్గతమైనట్లు సమాచారం. ఈ విషయమై వైద్యాధికారి అబ్దుల్‌రబ్‌ను 'సాక్షి' వివరణ కోరగా సునీత విధులకు హాజరైనట్లు ఏఎన్‌ఎంలు తమకు హాజరు నివేదిక ఇచ్చారని పేర్కొన్నారు. సీహెచ్‌ఓ అయూబ్ స్పందిస్తూ ఏఎన్‌ఎంలే ఆశ వర్కర్లు బిల్లులు చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని, ఆశ వర్కర్ సునీత విధులకు వస్తున్నారని చెప్పారు. ఆశ వర్కర్ సునీతను వివరణ కోరగా ఏఎన్‌ఎంకు వివరాలు చెప్పానని, మా అమ్మకు అనారోగ్యం కావడంతో మూడు రోజులు మాత్రమే రానని చెప్పానని వివరించారు.

కూలీలతో వెళ్తున్న వాహనం బోల్తా

- ముగ్గురికి తీవ్రగాయాలు, 40మందికి స్వల్పగాయాలు


కనిమెట్ట వద్ద ఎన్‌హెచ్44పై బోల్తా పడిన బొలెరో వాహనం

కొత్తకోట రూరల్: పరిమితికి మించి కూలీలతో వెళ్తూ బొలెరో వాహనం బోల్తాపడింది. ఈ సంఘటన మంగళవారం ఉదయం కొత్తకోట మండలం కనిమెట్ట వద్ద జాతీయరహదారి44పై జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు కాగా 40 మందికి పైగా కూలీలకు స్వల్పగాయాలయ్యాయి. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని భూత్కూర్‌కు చెందిన 40మందికి పైగా, కొత్తకోటకు చెందిన 6మంది మహిళా కూలీలు బొలెరో వాహనంలో కొకుంట్ల మండలం ఎంకంపల్లికి పత్తి ఏరేందుకు బయలుదేరారు. డ్రైవర్ ఎస్.ఆంజనేయులు వాహనంలో పరిమితికి మించి జనాలను ఎక్కించుకున్నాడు. కనిమెట్ట సమీపంలో వాహనం అతివేగంగా డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. దీంతో కూలీలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయారు. గాయపడిన వారి అరుపులు కేకలు మిన్నంటాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. బొలెరో రోడ్డుకు అడ్డంగా పడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి సిబ్బందితో కలిసి ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులను వివిధ ఆసుపత్రులకు తరలించారు. తీవ్రంగా గాయపడిన కళ్యాణి, జయమ్మను హైదరాబాద్‌లోని నిమ్స్‌కు, రేణుకను కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. సారంభీ, పర్వీన్, నర్సమ్మ, శైలజ, తిరుపతమ్మ, చిట్టెమ్మ, పుష్పను మహబూబ్‌నగర్ ఎస్వీఎస్‌కు మరికొందరిని కొత్తకోట, వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బోల్తాపడిన వాహనాన్ని పక్కకు తీసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. క్షతగాత్రుల ఫిర్యాదు మేరకు డ్రైవర్ ఆంజనేయులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తాపడి..


గాయపడ్డ కూలీలను పరామర్శిస్తున్న జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ యాదయ్య

జడ్చర్ల: పత్తి తీసేందుకు కూలీలను తరలిస్తున్న ట్రాక్టర్ బోల్తా పడింది. మంగళవారం మండలంలోని పెద్దఆదిరాల గ్రామానికి చెందిన కూలీలను ఓ రైతు పొలానికి తరలిస్తున్న ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో 16మంది గాయపడ్డారు. వీరిలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా మిగతావారికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్సకోసం ఆటోల్లో జడ్చర్లలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. లలితమ్మ, శివలీల, సుజాతకు తీవ్రగాయాలు కాగా అనిత, జంగమ్మ, కృష్ణవేణి, ఊర్మిళ, ఎల్లమ్మ, కృష్ణమ్మ, సుజాత స్వల్పంగా గాయపడ్డారు. బాధితులను జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ యాదయ్య, బీఆర్‌ఎస్ నాయకులు రఘుపతిరెడ్డి, రాంలింగారెడ్డి, సురేష్, శంకర్‌నాయక్ పరామర్శించారు.